వేదమతము.

27009
3.72

పురాతనకాలమునుండియు నార్యులగ్నియే పరబ్రహ్మమనితలంచి తదుపాసనాపరులయి యుండిరని నే నిదివఱలో వ్రాసి దానికిఁ దగినకారణంబులు దెలిపినాను. ఆర్యులపుడపు డాగమవిధులందు సోమరసపాన మొనర్చుచుండిరనిసైత మిదివఱలో వ్రాసినాను గాని సోమలతను దైవముగనెంచి దానినిఁ బూజించినట్టియు దానినిఁ జేయునట్టియు విధులుగల ఋక్కులవిషయము హెచ్చుగ వ్రాయలేదు. అప్పని నిప్పుడొనరించెద. ఋగ్వేదములోఁ దొమ్మిదవమండలము సంపూర్ణముగ నీ సోమదైవమును గుఱించినవిషయమేను. మిగత మండలములలోసైత మచటనచట నున్నవి. అగ్నియొక్క రసరూపము సోమమని యార్యులనమ్మకము. అగ్నిబలె నీసోమ దైవమునకుసైత మనేకరూపములు వాసస్థానములు గలవు. సోమజననమీ భూమికాదు. అగ్నితేజము సోమలత. అగ్ని యనేకకార్యములం దుపయుక్తపడును. సోమలత యొకకార్యమునకే యుపయోగింపఁబడును. సోమలతనుడికించి యగ్నికి బలిగనివేదించి యారాధించువారే యా రసపానమునకు నర్హులు. ఇది యార్యు లైరానులతోఁ గూడియుండునపు డీపూజ యారంభమయినదని తోఁచుచున్నది. "హొమా" యను నామమున నైరానులాగమ విధులొనరించి యార్యులబలె సోమపానముఁ జేయుచుండిరి. జరదష్ట్రిఋషి యైరానులమతమును బొత్తిగ సంస్కరించినను, పురాతనమునుండివచ్చిన యీ సోమపానాగమ విధినిమాత్రము మార్పఁడాయెను. సోమలత యైరానులబలె నార్యులకును బర్వతోద్భవమగులత. వరుణుఁడు సూర్యుని నాకాశమందునను నగ్గిని నీటియందును, సోమలతను పర్వతమందును నుంచెను. ఆకాశమునుండి మాతరిశ్వుఁడు దెచ్చి పర్వతముపై నుంచెను. గరుత్మంతుఁడు పర్వతమునుండి తెచ్చెను. ఈలత కేవల శీతప్రదేశమునందు పుట్టును గాని యెండవేడిమిగల దేశమునఁబుట్టదు. ఆర్యులు కాశ్మీరమువదలి పంజాబు చేరిన పిదపఁ గాశ్మీర గాంధారదేశములందుండు బేపారులు సోమలతతో వ్యాపారము సేయుచు ధనమార్జించుచుండిరి. అట్టివారనార్యులు. వారిని నార్యులు తుచ్ఛముగఁ జూచుచుండిరి. సోమలతనుండి రసముదించు క్రమము ఋగ్వేదమునందనేక ఋక్కులలో నుండినను నప్పటివేదభాష స్పష్టముగఁ దెలియదు. బ్రాహ్మణములలో నీ విషయము వివరింపఁబడినది. ఋక్కులు వ్రాయకమునుపు సోమలతను దెచ్చు విధమును దానినిఁ జేయువిధము నించుకవ్రాసెద.

సోమలతల నధికమాసములలోఁ గొనుటవిధి కావుననే యా మాసమును సోమలతల నమ్మువారును నింద్యులైరని తైత్తరీయ బ్రాహ్మణములోఁ

బలుకఁబడినది. దీని చిత్రమేమో తెలియకయున్నది. మూఁడుసంవత్సరముల కొకతూరి వచ్చు నధికమాసములో సోమలత కొనవలెననిన యాగాదులు మూఁడువత్సరముల కొకతూరి యొనరింపవలెనని యర్థమా? కాదేని నధికమాసములోఁ గొనియుంచిన లత నెల్లకాలము యాగాదులం దుపయోగింపవలెని యర్థమా తెలియక యున్నది.

సోమలతలు వేళ్లతోసహితముగఁ బర్వతములనుండి వెన్నెలకాలమునఁ బెల్లగించి పోగుఁజేసి బండ్లమీదనుంచి మేకపోతులతో నీడ్చుకొని యాగశాలకుఁ దెచ్చుచుండిరి. సోమలతలుంపను యాగశాలలో నొకభాగము శుద్ధిపఱచి గడ్డిని, చిన్నచిన్న కొమ్మలును పఱచి, దానిపై లతలుంతురు. పిదప బ్రాహ్మణులు రెండు ఱాళ్లచే నాలతల నదుముదురు. రసమును నదుమఁబడిన యాకులును శోధించుటకుఁ గాను చిక్కని (Fine) కంబడిలోఁ బఢవైచి యంగుళములతోఁ గలుపుచు, మఱల శోధింప రసమంతయుఁ గ్రిందనుంపఁబడిన పాత్రలోదిగును. పిదప రసములోఁ బాలును పులిమజ్జిగయును పెఱుగు మొదలగునవికలవి, యందున గోదుమగాని మఱియెద్దియైనను బండికోచముగఁ జేర్చి యుడుకఁబెట్టుదురు. అది చక్కఁగ నుడికి, యావిరికలిగినంతనె, దానినిఁదీయుదురు. ఈ రసము దినముమూఁడుతూర్లు బ్రాహ్మణులకు నిత్తురు. దైవములుసైత మీ పానీయము మెచ్చుచుందురు. దానినిఁ ద్రావినంతనె యానందరసమగ్నులయి బ్రాహ్మణులు మైకమందుచుండిరి. ఈరసము శారీరశుద్ధికిముఖ్యము ప్రాణాధారమగు జలమిది. మనుజునకు నారోగ్యము శమర్థ్యత నిచ్చునట్టియు స్వర్గమునకు మార్గముఁ జూపునట్టియు శాత్రవులఁ జంపునట్టియు వస్తువిది. ఈ రసముఁద్రావ నర్హులు గొందఱేను. యాగ పురోహితులుదప్ప మిగతవారు దానినిఁగోరిరేని నట్టివారు తమసరస మూఁడేండ్లకుఁ దగినంతబత్తెమున్నదని స్థాపింపవలెను. ఇది త్రావినవారు దైవములేతామని యెన్ని యనేకవిధములఁ బ్రల్లదము లాడుచుందురు,

M. 10. 119-వ సూక్త మిందులకు దృష్టాంతము. పైసూక్తము నేనిదివరలో వ్రాసినాను కావున మఱలవ్రాయుట యనావశ్యకము. పైసూక్తవర్ణన హెచ్చుగఁ ద్రావినవారి విషయము సామాన్యముగఁ ద్రావినవారు, చక్కఁగ మాటలాడుచుండిరి. "ఏమీతెలియని మా హృదయములో సోమదైవము ప్రవేశించినాఁడు." "సోమా! అగ్నిబలె మాతేజమును హెచ్చింపుము" "సూర్యుఁడు దినముపుట్టురీతి మా యాయువును హెచ్చింపుము." "మాబుద్ధి నీవలనఁ గుశలతఁగనినది." "నీవు మా యంగములందెల్ల నిండినావు," "రోగములెల్ల శక్తిహీనతచే బలుగిడెను," "శక్తిగల

సోమరసము మాయందున్నది కావున మాయాయువు హెచ్చినది. '' ఇట్టి మాటలు హెచ్చరికతో మాటలాడుచుండిరి. అయినను నా రసపానముచేఁ దమకుసైతము దేవత్వమువచ్చునని యార్యులు నమ్మియుండిరి. దేవతల కమృతమురీతి సోమరసము తమకు నమర్త్యతయు నసమానశక్తియు నిచ్చునని తలంచిరి.

చంద్రకిరణముల యార్ద్రత సోమలతలోఁ బ్రవేశించి యమృతము నించునని యార్యులు సంపూర్ణముగనమ్మిరి. తాపార్ద్ర సంయోగగుణము సృష్టికారణమని నేనింతకుమున్ను వ్రాసినాను. తాపము సూర్యరూపము. ఆర్ద్రత చంద్రరూపము. సూర్యచంద్రులిరువు రగ్నిస్వరూపములేను. నీటియందగ్నియుండును నీటియార్ద్రతయే సోమరూపము.

ఆర్యులు ప్రకృతిసాంబంధిక శక్తులును వానిమహిమలును జూచి వానికి దైవములని పేరిడి, గౌరవించుచుండిరని నేనుపలుమారు పలికినాను. అట్టి పురాతనార్యులు సోమలతయందలి రసపానమునఁ దమకేద్దియో విచిత్రశక్తి కలిగినది ప్రారంభమునఁజూచి యదివస్తుగుణమని తెలియక దానికి దైవశక్తినారోపించిరి. ఇది యార్యుల సహజగుణము. ఎప్పుడు దానిపానమున మనుజుఁడు తనసహజ శక్తికంటెను హెచ్చుకార్య మొనరించినచో నా రసమందెద్దియో దైవశక్తియున్నదను నమ్మిక స్థిరపడెను. అది త్రావినపుడా దైవశక్తి తమలోఁ బ్రవేశించినదని నమ్మిరి. కావున సోమలతకుఁ బూజ్యతఁ గలుగుటయగాక దానిరసమునుదీయు వస్తువులెల్లను గౌరవమందెను. ఈ సోమరసము దేవప్రియము కావుననే దైవములెల్ల నీరసమునందుఁ బ్రాముఖ్యతవహింప వాదులాడిరనియు పందెములో గాలి గెలిచినందున వాయువునకుఁ బ్రారంభబలియనియు నింద్రునకు రెండవబలిగను నిర్ధరింపఁబడెననీ తైతరీయ బ్రాహ్మణములోఁ దెలుపఁబడినది. ఈ పానమునుండి నగ్నులకు వస్త్రములువచ్చును. రోగములుగుణమగును. గ్రుడ్డివారికి దృష్టివచ్చును. కుంటివారు నడతురు.; అనగా సోమపానమొనర్చిన వారారీతిగఁ దామయినట్లు తలఁచుచుండిరి. ఈరసము దైవములకుసైతము నిర్జరత్వమిచ్చినది. దీనికిఁ బవమానమని మఱియొక నామము.

9. 113. (7) పవమానా! నశింపక యెల్లకాలము స్థిరముగనుండునట్టియు యశః ప్రకాశములు శాశ్వతముగ నుండునట్టియు లోకమునందు నన్నుంపుము.

9. 18. (1) సోమా! నీవు పర్వతములపై వసింతువు.

8. 2. (2) జనులచేఁ గడుగంబడి, త్రాళ్లచే నొత్తంబడి, కంబళమున శోధింపఁబడి, ప్రవాహమునమునిఁగి లేచిన గుఱ్ఱమువలె నుందువు.

8. 48. (1) రుచ్యమగు సోమరసమును నేను సేవించినపుడు నాకు దైవభక్తి కుదురును. ధనముదొరకును. మర్త్యులు నమర్త్యులు నది తమ యాహారమని దానిచుట్టును జేరుదురు.

9. 64. (25) సోమా! శుద్ధపఱచఁబడి నీవు సహస్రాధికముగ మాకు వాక్సిద్ధి గలిగించి ఋక్కులొనరించులాగునఁ జేసెదవు.

9. 68. (7) ఋషులతోను వారిస్తుతి ప్రార్థనలతోను, బదుగు రాఁడువారితోను నీ వలంకరింపఁబడి, యుడుకుచు మాకు మిత్రముగనుండి, మావలన నెత్తంబడి, దైవస్తుతులచేఁ గొనియాడంబడి, కంబళమునుండి జారి, శాత్రవధనమార్జింప శక్తినిచ్చుచున్నావు.

9. 114. (3) సప్తలోకములకు, సప్తాదిత్యులున్నవారు. సప్తఋషు లున్నవారు. ఆదిత్యు లేడుగురేను, వీరితోఁగూడి సోమదైవమా! ఇంద్రునికొఱకుఁ బ్రవహింపుము.

8. 68. (2) బయలుగనుండు దానినిఁ గప్పెదవు. రోగములకు మందిచ్చెదవు. గుడ్డివాఁడు చూచును. కుంటివాఁడు నడచును.

పై రీతిగ సోమరసపానమునుండి యాగాదులందు బ్రాహ్మణము (మంత్రము) లుచ్చరించి బ్రాహ్మణులకు దైవశక్తివచ్చినట్టు తోఁచుచుండినందున వారీ సోమరసమునకు దేవత్వమారోపించి పూజించుచుండిరి.

పైన వివరించిన యార్యుల ముఖ్యదైవములుగాక, మఱికొన్ని దైవములు గలవు. వారివిషయము ముందువ్రాసెదను.

ఆర్యులు ప్రకృతిసాంబంధిక శక్తులను (Powers of Nature) మూఁడు విధములుగ విభజించిరి.

(1) సృష్టిశక్తి. (Creating Energy)
(2) రక్షణాశక్తి. (Sustaining Energy)
(3) లయశక్తి. (Destroying Energy)

సృష్టిశక్తికి భూతకోటిని సృజించుకార్యము, ముఖ్యమయినను మిగత రెండుశక్తుల సామర్థ్యమును దానికిఁగలదు. మిగతశక్తులకు నదేరీతిగ సామర్థ్య

27009
30.2.73

ములు గలవు. ఈ శక్తులు, "అగ్ని వరుణేంద్రాదిత్య భూమ్యాకాశములును వాయు
సోమలతలు". సోమలతకు గౌరవము దానిరసపానముచేఁ గలిగినదికాని యది
యొక ప్రకృతి సాంబంధిక శక్తియని నే నమ్మను. సృష్టిస్థితిలయ కారకులగు పై
దైవముల నార్యులు కొంతకాలమునకు వదలి యా దైవములకే వేఱునామములిచ్చి,
బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులని పిలువసాగిరికాని శక్తులవియేను. వానినిమించిన
శక్తులెవ్వియును లేవు. ఇఁక మన పౌరాణికగాథలు పాండిత్యఫలములు. రహస్యార్థ
ఖనులు. బాహ్యార్థాభిరుచిచేఁ బామరజన పఠనార్హములు. సర్వదేశీయులకు సామా
న్యముగ నిట్టిగాథలున్నవి. ఆ గాథలు సైతము చక్కఁగఁ బరిశోధించినచోఁ దైన
నే బలికినదియ సారాంశమగును. బ్రహ్మమునుగుఱించిన విషయ మీవిచారమునకు
సంబంధించదు. ఆ విచారమే వేఱు. ఆ విచారమునం దీశక్తులవిషయ ముపవాద
ముగనుండునుగాని ముఖ్యవిషయముగనుండదు. ఈ విషయములెల్ల జను లాలో
చించినయెడల నిపుడు తమకుఁగల యనేకదురభిప్రాయములును మతవైషమ్య
ములునుమాని పురాతనార్యులబలె సుఖముగ జీవింతురు.

పై శక్తులను నార్యులు దైవములుగ గౌరవించుచుండినదియగాక మఱి
కొన్ని దైవములను సైతము పూజించుచుండిరి. ఆ దైవములు ముఖ్యదైవములకు
నుపశక్తులయి ముఖ్యశక్తుల సామర్థ్యములను జూపుచుండును కావుననే యా
ర్యులు ముఖ్యదైవములకు నుపయోగించిన విశేషణములును బిరుదులును నుప
శక్తులకుసైత ముపయోగించుచు వచ్చినారు. దీనినిఁ జక్కఁగఁ దెలియలేక యార్యులు
చూచినవస్తువులనెల్లను దైవములుగఁ బూజించువారని యన్యమతమువారు హేళన
మొనర్చెదరు. ఇది యొక దృష్టాంతపూర్వకముగఁ జూపఁదగిన విషయము. మము
నేలు చక్రవర్తియొకఁడు. అతఁడెందున్నవాఁడో యనేకులకుఁ దెలియదు. అతని
యధికార మతఁడొక్కఁడే నడపఁడు. అతనిచేతిక్రింద ననేకులుండి యతని యధి
కారము నెఱవేర్తురు. దైవవిషయమున మనుష్యుల దృష్టాంత మన్నిటబోలదని
నాకుఁ దెలిసియుండినను వేఱొకవిధమగు దృష్టాంతము దొరకనందున పై దృష్టాంత
మిచ్చినాను. ముఖ్యశక్తియగ్ని. అదియే ముఖ్యదైవము. అతని యధికారమగు తేజ
మును సర్వప్రపంచమందును వ్యాపింపఁజేయుటకు నాదిత్యు లనేకులేర్పడిరి. సోమ
లతయం దాయగ్నిగుణమునే యారోపించినారు. ఇంద్రునకు మరుత్తుల సాహాయ్య
ముండుటచే వర్షము దేశదేశము వ్యాపించును, మేఘములు విచ్చికొనును. ఈరీతి
నే సకలశక్తుల వ్యాపారము, ఋగ్వేదమును జక్కఁగబరిశోధించి యీ విషయముఁ

తెలియవలెను. మనఘాందసులరీతి స్త్రీలబలె నోటిచే నేర్చుకొని విమర్శనచేయక యుండినచో ముందుసైత మనేకానర్థములకుఁ గారణములు బలపడును. సర్వకల్మషములు పరిహరించు గుణ మగ్నికిఁగలదు. సూర్యునకుఁగలదు. ఇంద్రునకుఁగలదు వాయువునకుఁ గలదు నీటికిఁగలదు. కావునఁ గల్మషపరిహారక ధర్మమునఁ బైశక్తులగ్నిరూపములేను. ఆర్యులు వాయువు నగ్నిగవర్ణించినచో విచారింపక యది తప్పనుట దోషము. పురాతనార్యు లెన్నివిషయములు మనమునందుంచుకొని వ్రాయుచుండిరో మనకుఁదెలియదు. కావున ఋక్కులు చదువునపుడు మన యావచ్ఛక్తి నుపయోగించి పురాతనార్యుల మానసమును మనము గుర్తెఱుఁగవలెను. కొన్ని విషయములలోఁ బొరపడుదుము. దానినుండి తప్పేమియునులేదు. వేదభాషక్లిష్టము: శబ్దార్థములిపుడు మారినవి. ఋక్కులలో నెద్దియైన నొక విచిత్రశబ్ద ముండినచో నా శబ్దమునకు నిపుడు వాడుకలోనుండు నర్థమునిచ్చి మన మన్వయింతుము. అప్పటికాలమునం దార్యులాశబ్ద మేయర్థమున నుపయోగించిరో మనకుఁదెలియదు. సాయనాచార్యులు సైతము కొన్నిసమయములందు శబ్దార్థవిచారమునకుఁ గష్టపడినారు. కొందఱు పండితులు వారితో నేకీభవింపక వేఱర్థముచేసినారు. ఇప్పటి పాశ్చాత్యపండితులు మఱియొకయర్థము గల్పించినారు. కావునఁ గొన్ని ఋక్కు లర్థములుకావు.

అశ్వినులు.

ఇక నుపశక్తులనుగుఱించి వ్రాయఁబూనెదను. అశ్వినులనుండి ప్రారంభించెద.

సూర్యుని రథాశ్వములనఁగ నతని సప్తకిరణములు. అవి తూర్పుదిక్కున దూరముగఁ బొడఁజూపినంతనె పుట్టునట్టివి కావున నశ్వినీదేవతలని నామముకలిగెను. ఈ యశ్వినుల రాకవలనఁ బ్రాతఃకాలము సూచింపఁబడును. కావున నుషస్సుల రాకఁ జాటువారని పేరువచ్చెను. సూర్యుని రథధ్వజము లశ్వినులని కొన్ని ఋక్కులందు వర్ణించినారు. అశ్వినీదేవతలకు వైద్యులని బిరుదు. ఉషఃకాలమునకు మున్నులేచి తమతమ కార్యములందాసక్తులగువారికి రోగములురావని యార్యుల యభిప్రాయము. అశ్వినులగ్నికి మిత్రములని వర్ణింపఁబడినారు. అశ్వినులు పొడఁజూపినంతనె జనులు తమ యాగవిధులొనర్ప నగ్నినిఁ బ్రజ్వలింపఁ జేయుదురని యర్థము. ఇట్టులనే యశ్వినులనామముల యుపయోగములు దెలియవలెను. అశ్వినీదేవతలనామము లనేకఋక్కులం దగపడుటయగాక సూక్తములుసైత మనేకములున్నవి. సూర్యుని కొమార్తెయగు సూర్యమనశ్వినులకిచ్చి వివాహముచేసినటులఁ

గొన్ని ఋక్కులున్నవి. దీనిరహస్యార్థము సందేహాస్పదముగ నున్నది. సూర్యుఁడు తన ప్రకాశమరణముగ నశ్వినులకునిచ్చును కావున నల్లునకు మరణమిచ్చెనని కొందఱూహించిరి. అశ్విను లొక్కరా యిరువురా యనునదిసైతము సందేహముగ నున్నది. శబ్దస్వారస్యమున నిరువురని గాథలుపలుకుచున్నవి. అశ్వినులన సంధి సమయము లుండునాయని యొకసందేహము కలుగుచున్నది. అశ్వినులనియు నుషస్సులనియు కాలమును రెండువిధములుగ విభజించినారు. అరుణోదయము లశ్వినులకాలమనియు ప్రాతఃకాల ముషస్సులనియు, మఱల సాయంకాలమందలి సాంధ్యరాగ మశ్వినులకాలమనియు ప్రదోషముషస్సులకాలమనియు నాకుఁ దోఁచెను. సంజయందలి యశ్వినులు సారమేయములు. సంజయందలి యుషస్సు "సరమ" యనియు నామభేదములు సూర్యుఁడస్తమించినతోడనె పశ్చిమప్రదేశ మునందరుణోదయమును బిమ్మటఁ బ్రదోషమును సహజముగదా?

అశ్వినులుషస్సులగుఱ్ఱములను దోలువారనిసైతము కొన్నిఋక్కులలో నున్నది. ఈ యశ్వినుల విషయమునఁగల కొన్నిఋక్కులిచట వ్రాయఁబూనెద.

M. 1. 3. (1) అశ్వినులారా! సకలసంపత్సమేతులయి ప్రకాశమున కాలవాలమయి చురుకుగల హస్తములతో మీరు మా బలులందుఁడి.

(2) ఆశ్చర్యకరమగు కర్మలొనర్చుచు, మాస్తుతులందుచు నుండు నశ్వినులారా! దయాళురయి మాఋక్కు లందుఁడి.

(3) అద్భుతకార్యములొనర్చు నాసత్యులారా! కుశతృణములపై నుంచిన బలులు మీయవి. అగ్నిజ్వాలలబలె నెఱ్ఱగనుండు మార్గమున మీరు సంచరించు చున్నవారు.

"ఎఱ్ఱనిమార్గమున మీరు సంచరించుచున్నవారనిన" నరుణోదయమున సంచరించువారని యర్థమగును. అశ్వినీ దేవతలలో నొకరినామము "నాసత్య" యనియు, మఱియొకరినామము "దస్ర" యనియు తెలియవచ్చుచున్నది. నాసత్య యన, నసత్యమునకు విరుద్ధుఁడగు వాఁడు. దస్రయన: జెడుగులు చెఱచువాఁడు. బహుశా ప్రాతఃకాలము నాసత్యులది. సాయంకాలము దస్రులది యుండనగును.

1. 18. (3) నాసత్యులకు నిరువురికిఁగాను బలిభువులొక చులుకని రథమును నిర్మించిరి. అదిసర్వదిశలుఁ దిరుగుచుండును. వారమృతమునుబిందు గోవు నుద్భవింపఁ జేసిరి.

(4) వారు తమప్రార్థనలచే సదాకాలము నిర్మల హృదయముగలవారయి

నాసత్యుల తలిదండ్రులకు ముదిమి లేనటు లొనర్చిరి.

నాసత్యులిరువురని యొకటియేర్పడెను. వారి తలిదండ్రులు భూమ్యా కాశములుండనగునని నే నూహించెద. పైనఁ బలుకఁబడిన ఋభుల చరిత్ర ముందు వ్రాయఁబూనినాను. ఈ యశ్వినీదేవతలను గుఱించి మఱికొన్ని ఋక్కు లిచట లిఖించెద.

1\. 22. (1) అశ్వినీద్వయము తమరథము నుషఃకాలమునకుమున్నే సిద్ధపఱచికొని మేమిడు సోమరసము సేవింప వత్తురుగాత.

(2) స్వర్గమునుజేరు రథిక శ్రేష్ఠులైనట్టియు దివ్యరథము నెక్కినట్టియు నశ్వినీయుగ్మమును మేము పిలుచుచున్నాము.

1\. 34. సూక్తములోఁ ద్రికాలములందు నిచ్చు బలులనంద నశ్వినీదేవత లాహ్వానింపఁ బడినారు.

1\. 139. (4) అశ్వినీదేవతలారా! మీరుగదా స్వర్గమును దెలుచువారు. ప్రాతఃకాలాగమవిధులందు మీరుంటకుఁగాను మీ రథములకు గుఱ్ఱములు కట్టఁబడినవి. స్వర్ణరథపీఠముపై మిమ్ము గూర్చుండఁబెట్టితిమి. సమీపమార్గమనియు సరియైనమార్గమనియు మీ రంతరిక్షమార్గ మనుసరించితిరి.

M. 5. 73. (5) సూర్యుఁడు మీ రథమెక్కినపుడు మీరథము వేగముగఁబోవును. ఎఱ్ఱనిపక్షులు మీచుట్టునుండును. భూరిజ్వాలలు మిముఁగప్పును.

పై ఋక్కులో సైత మశ్వినులు సాంధ్యరాగములు వ్యాపించు కాలముననే వత్తురనునది స్థిరపడును. ఇటులనే యనేకఋక్కులున్నవి. ఈ యశ్వినీదేవతలు దేవవైద్యులనియు వీరొనరించిన శాస్త్రమే ప్రపంచమున వైద్యశాస్త్రముగ నేర్పడినదనియు ప్రసిద్ధి. అశ్వినులు సదాయౌవనవంతులు. రూపవంతులు. అనేకరూపములు ధరింప సామర్థ్యముఁగలవారు. గరుత్మంతునిబలె వేగగమనముఁ గలవారు. స్వర్ణరథమునకు గుఱ్ఱములనైనను పక్షులనైనను గట్టి యాకాశమార్గమున నడచుచుందురు. సాంధ్యరాగములను మహాత్సద్దములుగ నొనరించి పురుషదైవములుగ నుతించినారు. అశ్వరూపముగ దాఁచికొనిన సూర్యునిభార్యయగు సంజ్ఞాదేవిని సూర్యుఁ డశ్వరూపముగఁ గూడినందున నశ్వినులు పుట్టిరని గాథలుపన్నినారు, సంజ్ఞయన నాకాశము. అచట సూర్యుఁ డరుణరూపమునఁ గనపడినతోడనె యశ్వినులుపుట్టిరని యర్థము, అశ్వినులవయస్సు రూపము, ప్రకాశము వేగగమనము,

దివ్యరూపము, రోగనివారకగుణము, పరోపకారబుద్ధి యీగుణములెల్ల ఋగ్వేదము నందు వర్ణింపఁబడినవి. అశ్వినులు దివ్యవైద్యులు కావున, విషజలములోను నగ్ని గుండములోను బడిన, రేభవందన, కణ్వ, యంతక, ఋజ్యా, కర్కంధు, వాయ్య, సుచాంటి, అత్రి, పురుకుత్స, ప్రిశ్నిగ్వ, చ్యవనాదులను వారివారి బాధలనుండి రక్షించిరని యనేకఋక్కులలో సూచింపఁబడినది. అశ్వినులు చ్యవనుని యౌవన వంతునిఁజేసి సోమపానార్హులైన గాథ ఋషు లనుశీర్షికక్రింద వ్రాయఁబడినది. చూడనగును.

ఇఁక నుషస్సులనుగుఱించి ఋగ్వేదమున ఋక్కులనేకములున్నవి. ఈ దేవతకు గ్రీకుదేశములో "ఇయాస్" (Eos) యనియు రోం దేశములో "అరోర" యనియు నామములు. ఈ దేవతలనుగుఱించి యనేక ఋక్కులేగాక సూక్తము లున్నవి. ఆర్యులదేవతారాధన యుషఃకాలమునఁ బ్రారంభమగు కతంబున నా రీతిఁ బ్రార్థింపఁబడినది. ప్రాతఃకాలమున నార్యులు లేచినక్షణముననే యుషస్సె ల్లెడల నగపడుచుండెను. దినమువచ్చునని వారిహృదయ మానంద వారిధిలో మునుఁగుచుండెను. కావున నీ దేవతనుగుఱించిన ఋగ్వేదఋక్కు లతిమనోహర ములుగను నత్యలంకార సహితములుగను నున్నవి. తళతళమని ప్రకాశించు వస్త్ర ములను ధరించిన కన్యయనియును తనసోదరియగు నంధకారమునుఁ బాఱఁదోలున దనియు సూర్యునిమార్గము చక్కఁబెట్టునదనియు యాగమవిధులకాలము చాటున దనియు నిద్రనుండి జీవకోటిని లేపునదనియు కనులుగానరానివానికి దృష్టి నిచ్చున దనియు కుంటివారికి బలమిచ్చునదనియు వర్ణింపఁబడినది. అయినను నాదేవతరాకకు సంతసించుచు స్తుతించువారు చనిపోవుటయు, దినమురాకచేఁ గ్లుప్తాయువుకు నొక దినంబు తగ్గుటయునుజూచి కొన్నిసమయములందా దేవతయొక్కరాకకు దుఃఖించు చుండిరి. ఈ యుషస్సు స్వర్గమునకుఁ గొమార్తెయనియును సూర్యునిచే మోహింపఁ బడి వానికిఁజిక్కక తప్పించుకొను చున్నదనియును ఋషులు వర్ణించినారు.

M. 1. 124. (1) అగ్నిని రాజిల్లఁజేయఁగనె, సూర్యుఁడుదయింపఁగనె యుషస్సు తనప్రకాశమెల్లెడ వ్యాపింపఁజేయును.

(2) దైవికములగు ఋతువిధుల ననుసరించి యాయుఃకాలము తగ్గించి నను నంత్యములేక గతించిన ప్రాతఃకాలములకుఁ దుదిదై, రాఁబోవు వేకువలకు మొదలయి యీప్రాతఃకాలము ప్రకాశించు చున్నది.

(3) అల్లదిగో పూర్వదిశను నాకాశ రాజుబిడ్డ యుషస్సు ప్రకాశమను వస్త్రమును ధరించుకొని నగపడుచున్నది. దైవికమగు ఋతుమార్గమున సంచరించుచున్నది. దిశలెల్లనెఱింగినది కాన దారితప్పదు.

(4) ఆకాశ దేవతయెద, సమీపమున నగపడుచున్నది. క్రొత్తపాటను పాడువానిబలె మనోహరములగు వస్తువులను జూపుచున్నది. నిద్రబోవువారిని లేప నీగబలె వచ్చుచున్నది. దేవతలలో నిజమయినట్టియు మార్పులేనట్టియు దేవతయిది.

(5) మేఘసముద్రములోఁ బూర్వార్ధమునఁ గిరణగోవులతల్లి తన చిహ్నముజూపుచున్నది. వెడల్పుగ వ్యాపించుచుఁ దనతల్లిదండ్రుల తొడలనెల్ల నిండుచున్నవి.

(6) అతివిశాలముగ వ్యాపించిన తనప్రకాశమును, తన బంధువులకును క్రొత్తవారికిని సమముగ నిచ్చుచున్నది. ఆదేవత యత్యధికముగఁ బ్రకాశించుచుఁ దన యంగసౌందర్యమునకు గర్వించుచున్నను బేదవారినిఁజూచికాని, గొప్పవారినిఁ జూచిగాని మరలదు.

(7) ఆ దేవత తనరథము నెక్కి, సోదరుఁడులేని యువతి ధనార్జనకు వెడలినటుల మనుజుల నరయఁబోవుచున్నది. ఉషస్సను యువతి, యలంకారయుతయయి, చిరునగవునగుచు దనభర్తనుఁ బ్రేమించుచుఁబోవు స్త్రీబలెఁ దనసౌందర్యమెల్లవిప్పి చూపుచున్నది

(8) అక్కయొక్క రాకనుఁగని, చెల్లెలు తనత్రోవ వదలుచున్నది. ఆపు డక్క తన సౌందర్యమంతయును జూప నలంకృతయయి, సూర్యకిరణములతోఁ బ్రకాశించుచు, నుత్సవకాలములందు స్త్రీలు సభలకుఁబోవురీతినిఁ బోవుచున్నది.

(11) తూర్పుదిశనుండి, యీవచ్చిన్నది, మనపైఁ దనదయఁ జూపినది. ప్రకాశించు నెఱ్ఱయెద్దులకు జీనులువేసినది.

(12) గూళ్లువదలి పక్షులు వెడలిపోవునటుల, నీ యుదయమున జనులాహారార్జనమునకునై వెడలెదరు etc.

ఆహోరాత్రము లిరువురక్కచెల్లెండ్రనియును నాకాశరాజు కూఁతురు లనియును నిరువురు పరోపకారులనియును నిరువురు స్వాగతార్హులనియును దమతమ కాలములందు జనులకు మేలుసేయువారనియును వరుణుని ఋతువిధులకు విధేయ

21009
25.3.73

లగువారనియు వర్ణింపఁబడినారు. ఇచటిరాత్రులు మానవశత్రువులుగఁ బలుకఁబడలేదు. దయాళువగు మిత్రమనియు చల్లఁదనమును విశ్రాంతియు నిచ్చునట్టిది యనియు, మెత్తనితల్లిగ నలసటఁదీర్చుచు నూఱడించునదనియు తెలుపఁబడినది. ఈ యిరువు రక్కచెల్లెండ్రును చక్కని నేతపని నేర్చినవారు, వారు సదావస్త్రములను నేయుచుందురు. ఉషస్సు బంగారు దారముతోను, రాత్రి, నల్లనిదారముతోను వస్త్రములను నేయుదురు. ఒకతె, రెండవదాని నేతపనిఁ జెఱచుచుండును. ఉషస్సాకాశమునఁ బొడఁజూపినమాత్రనె చెల్లెలునేసిన యంధకారము చెడిపోవును. అపుడే సూర్యుఁడు వెంబడించి యంధకారమనెడి చర్మమును జుట్టివేయును. అటులనే, రాత్రి, యుషస్సునేసిన తెల్లనివస్త్రమునుజుట్టి యంధకారమను నల్లనివస్త్రము నేయును. అక్కచెల్లెండ్రిరువు రీచెడుగుపనిని నిర్విరోధముగఁ జేయుచుందురు. ఆహోరాత్రము లక్కచెల్లెండ్రుగ నుండినను నొకరినొకరు పాఱఁదోలుచుందురు. వీరిరువురిలో నెవరుపెద్ద యెవరుచిన్న యనునది తెలియక యొకఋషి ప్రశ్నించినాఁడు. ఉషస్సునకు సూర్యునితోఁగల బాంధవ్యము సహజముగనుండినను, గొన్ని తావులందు భిన్నించుచున్నది. ఉషస్సు తన్ను మోహించిన సూర్యకిరణవ్యాప్తిచే మెఱయుచున్నది. యువతివెంట నంటిన యువానునిమాడ్కి సూర్యుఁడుషస్సును వెంబడించుచుండును. అయినను నదివాని చేతికి దొరకదు. సూర్యుఁడు దానినిఁ జేరఁజాలఁడు. ఒకఋషి యుషస్సునుగుఱించి పలుకుటలో " ఆలసింపక పఱుగిడుము. దొంగబలెగాని శాత్రవునిబలెఁగాని సూర్యుఁడు నిన్నుఁబట్టి కాల్చివేయునని " పలికినాఁడు. మఱియొకచోట నుషస్సు ప్రకాశించుగోవనియు సూర్యుఁడు దాని దూడయనియు వర్ణించినారు. రాత్రియనునది యంధకారయుతమగు గుఱ్ఱపుశాల యనియు ప్రకాశాశ్వములు దానిలోనుండుననియు యుషస్సు దానివాకిలిఁ దెఱచుననియు వర్ణింపఁబడినది. ఋషులు మేఘములనావులుగను గుఱ్ఱములుగను వర్ణించుచుందురు. అటులనే సూర్యునిసైతము పోల్చుచుందురు. మేఘములను గొఱ్ఱెలుగను నుషస్సును గొల్లదిగను వర్ణించినారు. అహోరాత్రములు రెండును రెండావులనియు వాని పొదుగులలోనుండి రెండురంగుల పాలుపిదుకుచుండుననియు యింద్రుఁడు నల్లావునందు నల్లపాలుంచెననియు తెల్లావునందు తెల్లపాలుంచెననియు వర్ణింపఁబడినవి. ఆవులు మేఘములకును, ఫాలాకాశములకును ఋషులు పోల్చుచుందురు. ఉషస్సు సంపన్నురాలనియు ప్రాతఃకాలమునఁ దనస్వర్ణసంపదఁ జూపుననియు పలుకఁబడినది. ఈసంపదను చెల్లెలగు రాత్రి దాఁచియుంచును. దాఁచిన ధనమును నక్క ప్రాతఃకాలముననే తీసికొనును. ప్రతిగృహమునకును బోయి

యింటివారినినిద్రలేపి వారినిఁ దమతమ పనులకుఁబంపి ఋజుమార్గమున వారినిఁ బ్రవర్తింపఁజేసి పోషించును.

పైన నాచేఁబలుకఁబడిన విషయములకెల్ల నాధారములుగ ఋక్కు లున్నవి. ఋగ్వేదమునందెల్ల నుషస్సునుగుఱించిన ఋక్కు లతిమనోహరములుగ నున్నవని యనేకుల యభిప్రాయముతో నే నేకీభవించుచున్నాను. కొన్ని ఋక్కు లిచట దృష్టాంతములుగ వ్రాయుచున్నాను.

M. 1, 48. (1) ఆకాశరాజ సుతయగు నుషఃకాలదేవతా! యశఃప్రకాశములచే మాకు సౌభాగ్యసంపదలిచ్చుచు నుదయింపుము. మాకుభాగ్యము నిమ్ము.

(2) దానశీలురగు నుషస్సులు మాకుఁ బశుధనమును నశ్వధనమును నిచ్చుచు దినదినము మముఁజేరుదురు. దేవతలారా! రాజులక్కు దాతృత్వము నేర్పి మాకాదానమునిండు.

1. 122, (1) దక్షిణయను విశాలరథము సిద్ధమైనది. అమర్త్యులగు దైవములు రథమెక్కిరి. జనులగృహములను బ్రకాశింపఁజేయుటకై గొప్ప దేవత యంధకారములోనుండి వెలివడినది.

(2) ప్రాణకోటి నిద్రలేవకమున్న వారికిఁగాను నుషఃకాలదేవత భాగ్యమును సిద్ధపఱచికొని సదాకాలములందును బాలికయయి యందఱినిఁ జూచుచుండును. ప్రాతఃకాలారాధనకు నుషస్సే ముఖ్యదేవత.

(4) ప్రతిదినమును, నా దేవత తనరూప మగపఱచుచుఁ, బ్రతిగృహ మందును దనప్రకాశము వెదజల్లుచున్నది. తళతళమను ప్రకాశ మున జయమార్జింప వచ్చుచున్నది. సకలదైవములలోను నుషస్సు భాగమునకుఁ జేరిన హవిస్సు మేలైనది.

(5) ఆనందదేవతా! భగవరుణుల చెల్లెలా! నుతింపఁబడినవారిలో నీవు మొదటిదానవు చెడుఁగు తలఁచువాని బలము చెడుఁగాత.

(6) దూరముగఁ దనప్రకాశము వ్యాపింపఁజేయుచు నుషస్సు, రాత్రి దేవత దాఁచినధనము నగపడఁజేయుచున్నది.

(7) అహోరాత్రములు వేఱువేఱు రంగులుగలిగి యొకరినొకరు ఖండించుచు నొకరు వెళ్లగనె మఱియొకరు వచ్చుచున్నారు.

భూమ్యాకాశములను జుట్టిన యంధకారమును, ప్రకాశరథము నెక్కి యుషస్సు దాఁచుచున్నది.

(8) ఈదినము వహించిన రూపమునే రేపునుధరించు వరుణుని ఋతు విధుల ననుసరింతురు. అనింద్యలయి యనేకలోకములు సంచరించి స్వర్గముఁ జేరుదురు.

(9) ప్రారంభదినస్వభావమునుఁ దెలిసిన యుషస్సు, తెల్లనిప్రకాశ ముతో నల్లనిచీకటినుండి వెలివెడలును. ఈకన్య ఋతువిధి క్రమము మీఱదు. దినమూను నిర్దిష్టస్థలము జేరును.

(10) ఉషఃకాలదేవతా! కన్యవయి సౌందర్యగర్వమునమించి నిన్ను మోహించు దైవము సరసకుఁ బోవుచున్నావు. వయోవతివయి చిఱునగవునగచుఁ బ్రకాశించుచు, నీ ప్రియునకు నీ రూపముఁ జూపుచున్నావు.

(11) తల్లిచేఁ జక్కఁగ నలంకరింపఁబడిన పెండ్లికూఁతురుబలె, నందఱుఁ జూచులాగున నీ వగపడుచున్నావు.

(13) శాశ్వత ఋతువిధులకు విధేయతఁ జూపుచు, మనుజులలోఁ బ్రతి మానవునకు మంచితలంపులు పుట్టులాగొనరింపుము.

M, 1. 164. (17) ఆకాశమునకుఁ గ్రిందిభాగమునను భూమికిఁ బైభాగమునను తన దూడను (సూర్యుని) పాదములక్రింద నుంచుకొని గోవు (ఉషస్సు) ఉదయించెను. ఏ దిక్కున నెటికి నది పోయెనో తెలియరాదు. ఎచట దూడనుగనెను? పశువులమందలో కాదు.

(18) ఆ దూడ తండ్రి యెవరయినది జ్ఞానియయినవాఁడు తెలుపనిండు దేవతత్వమెందుండి పుట్టెను?

M. 3. 61, (1) ఉషఃకాలదేవతా! సకలసంపన్నురాలా? జ్ఞాన సంపూర్ణత్వమున స్తుతులు పాడువాని పాటలువినుము. అత్యంత సౌందర్యముగలిగి పురాతనాధునాతనదేవతవయి, జ్ఞానాధికతమించి ఋతువిధు లనుస రించు యువతీ! మాస్తుతులందుము.

(2) మనోహరములగు ధ్వనులుకలిగించుచు నదృష్టదేవతా! నీ ప్రకాశ రూపమగు రథము నెక్కి రాజిల్లుము. స్వర్ణమయమగు నీ రథాశ్వ ములు తమరంగులను దిక్కులెల్ల వ్యాపింపఁజేయుచు నిన్నచటికిఁ దేనిమ్ము.

(4) ఉషస్సు తనగుఱ్ఱముల కళ్లెమును వదలుగవిడిచి ధనికురాలగు నింటి యజమానురాలుబలె వచ్చుచున్నది, ఆశ్చర్యకరమగు

ప్రకాశమును దెచ్చుచున్నది. ఆ ప్రకాశమును భూమ్యాకాశములు నించినది.

M. 7. 75. [1] ఉషస్సు స్వర్గమునఁబుట్టి ప్రకాశించుచున్నది. ఋతువిధి ననుసరించి తన గాంభీర్యమాహాత్మ్యమునుఁ జూపుచున్నది. రాక్షసులను నంధకారమునుఁ బోఁద్రోలినది. జ్ఞానులగు నాంగిరసులా దేవతయొక్క మార్గమునుఁ జక్కఁబఱచినారు.

[2] ఈదినము సకల సంపద్యుక్తులగునటుల మమ్ము వృద్ధినందింపుము. సమస్తసుఖము లనుభవించులాగొనర్పుము. అనేకవిధ సంపదల నిమ్ము. పనులలో యశమువచ్చులాగొనరింపుము.

[3] ప్రాతఃకాలమునందలి ప్రకాశమునుఁ జూడుము. అనేకవిధములగు చాయలుగలిగి మా సరసఁ జేరుము. అంతరిక్షమెల్లను నిండి పావనాగమ కర్మములొనరింపఁజేసి యుషస్సులు వెళ్లినారు.

[4] దూరమునఁ దనరథమునెక్కి పంచజాతులు నివసించు స్థళములను దర్శించి మర్త్యులమార్గములను బనులనుఁ జూచుచు స్వర్గసుతయుఁ బ్రపంచ చక్రవర్తినియునగు నుషస్సు వెడలినది.

[7] సత్యమాడువారిలో సత్యవతిగను, బలవంతులలో బలవంతురాలుగను, దైవములలో దేవతగను, పవిత్రులలోఁ బవిత్రురాలుగను రాజిల్లుచుఁ గంచెలన్నియును దెంచి గోవులనిచ్చెను. ఉషస్సునుఁ జూచి గోవులమంద ప్రార్థించుచున్నది.

M. 1. 92. [3] పనిచేయు స్త్రీలబలెఁ బాటలుపాడుచు, దూరమునుండి తమకు నేర్పడిన మార్గములనుసరించి దానశీలుఁడగు యజమానునకు నాహార మమర్చుకొని సోమరస మొసఁగువానికి సమస్తవస్తువు లిచ్చుచు నుషస్సులు వచ్చుచున్నారు.

[4] నటిబలెఁ గసూదిబట్టలు ధరించినది. పొదుగునిండిన యావుంబలె నెదనుబ్బించినది. జీవకోటికిఁగాను ప్రకాశముస్పృష్టించి, గోవులుగల మందయొక్క కంచెవాకిలి దెఱచినటుల యంధకారమును వదలించినది.

[5] ఉషస్సుయొక్క శోభను మేముచూచినాము. నల్లనిదయ్యమునుఁ బాఱఁద్రోలినది. యూపస్తంభమునందలి చాయనుబోలె యుషస్సు తన ప్రకాశమందినది.

[6] రాత్రి మేరను మేము దాఁటితిమి. ఉషస్సు జనించి సమస్త వస్తువులు మేముచూచులాగొనర్చెను. స్తుతిపాఠకురాలింబలె నవ్వుచు

యశఃప్రకాశదాయినియై సౌందర్యవిలాసములతో మాకు ముదమును
నిచ్చుటకు లేపుచున్నది.

[9] ప్రపంచమెల్లఁ దనచూపులఁజూచుచు ప్రకాశరూపకమగు తన
లోచనములు పశ్చిమదిశకు వ్యాపింపఁజేయుచు, జీవకోటికిఁ జలన
శక్తి నిచ్చుచు తన్నుఁబూజించుప్రతిమనుజుని ధ్వనిని గుర్తించు
చున్నది.

[10] పురాతనకాలమునుండియు దినదినముఁ బుట్టుచు నొకవస్త్రము నే
సదాధరించుచు, మర్త్యుల యాయువును వెచ్చించుచుఁ, జమత్కా
రముఁగల వేఁటకాఁడు పక్షులయవయవము లొక్క టొక్కటి
తఱుఁగురీతిఁ దఱుగుచున్నది.

[11] స్వర్గపుమేరనుఁ జక్కఁగఁగని పెట్టి తనచెల్లెలను దూరముగఁ దోలు
చున్నది. మానవుల యాయుఃకాలముఁ దగ్గించుచు నుషస్సను
యువతి తనప్రియుఁడిచ్చిన శోభచే రాజిల్లుచున్నది.

10. 172. (1) నీ సంపూర్ణసౌందర్యమున రాజిల్లుచున్నావు. గోవులన్నియును
పాలుతోనిండిన పొదుగులుగలిగి నీమార్గముగుండ వచ్చుచున్నవి.

(2) అనుగ్రహమానసవయి, దానశీలవయి, ధర్మాత్ములను గూడికొని,
మాచే ఋక్కులు రచింపఁజేయుచున్నావు.

(3) ఉషస్సు తనచెల్లెలయొక్క వెసనమునుఁ బోఁగొట్టుచున్నది. గొప్ప
గుణముచేఁ జెల్లెలను మఱలఁదనదారి నడుచులాగొనర్చుచున్నది.

ఉషస్సులనుఋక్కు లనేకములున్నవి. వానినెల్ల వ్రాసినచో గ్రంథము
గొప్పదియగును.

రాత్రినిగుఱించి ఋగ్వేదమునం దొక సూత్రము మాత్రమున్నది. మిగత
ఋక్కు లందచటనచట దానివిషయము వివరింపఁబడినది. ఋషులు రాత్రినెచటను
దూషింపరు. కొన్నితావుల నుతించినారు.

1. 35. (1) జీవకోటికినెల్ల విశ్రాంతినిచ్చు రాత్రిని నే నాహ్వానించెద.

1. 62. (7) భగదైవ మలసటనందక, స్తుతులసాహాయ్యమున, వియోగమెన్నఁడును
లేని పురాణదంపతుల (భూమ్యాకాశముల) వెలుపఱచెను. ఉన్నత
స్వర్గమున నీ యైంద్రజాలికుఁడు కన్యలిరువురిని (అహోరాత్రములు)
నుంచెను.

(8) నవీనముగ జనించుచుఁ జిన్నపిల్లలు (అహోరాత్రములు) తమ
యిష్టానుసారముగ నటించుచు, వేఱువేఱు వర్ణములుధరించి, జంట
లుగఁబుట్టి, నొకరివెంటనొకరు పురాతనకాలమునుండి భూమ్యాకాశ

ములచుట్టును దిరుగుచున్నవారు. నల్లనియంగములుగలిగి రాత్రియును, ప్రకాశావయవములుగలిగి దినమునునున్నవి.

(10) అనేకసహస్రములగు పావనాగమవిధులందు యిరువురక్కచెల్లెండ్రును యజమానునిసరస భార్యలుగనో, తల్లులుగనో నిలుతురు.

M. 2. 38. (3) సవితృదేశమును, రాత్రి కొంచెముగ వ్యాపించెను.

(4) అదివరలో చేయంబడి చెడిపోయినవి మరల నేయ నారంభించెను.

M. 10. 127. (1) రాత్రిదేవత తన స్వర్ణలోచనములచే ననేకప్రదేశములు చూచుచున్నది. తనయశోరూపముల ధరించుచున్నది.

వాయువుపుట్టెను? ఎచటినుండివచ్చెను? దైవముల ప్రాణవాయువతఁడు ఈ దైవము తానెచటనుండినను దనయిష్టానుసారము సంచరించుచుండును. వానిధ్వని మేమువిందుము. వానిరూపముఁ గనలేము.

M. 1. 135. (3) భర్త, నిద్రపోవుభార్యను లేపినట్టుల వాయువు ప్రజలబుద్ధినిఁ బ్రజ్వలింపఁజేయును. భూమ్యాకాశములు రాజిల్లఁజేయును. ఉషః కాల దేవతలను రాగిల్లఁజేయును.

(6) వాయుదేవా! నీవందఱిలోఁ బ్రథముఁడవయినందున సోమపానమునకు నీవు ప్రథముఁడవైతివి.

M. 4. 46. (1) సోమరసములో శ్రేష్ఠమగుభాగ మీ యాగమవిధిలో నీవందుము. నీవారంభమునఁ బానముసేయువాఁడవు.

48. (1) ఋషులు తమ శాత్రవులధనమంది సోమరసము సిద్ధపఱచినారు. ఎవరు నిఁకను దానినందలేరు. నీవుస్వీకరింపుము.

M. 8. 18. (9) పావనకరమగుగాలి మనోహరముగ మాపైవీచనిమ్ము. శాత్రవులఁ బోఁదోలనిమ్ము.

M. 10. 186. (1) ఆనందారోగ్యములిడి వాయువు తన పరిమళసారము మాలోఁ జొరులాగొనర్చుఁగాత. మాయాయువు హెచ్చించునుగాత.

(2) వాతమా! నీవు మాతండ్రివి నిజము మా సోదరుఁడవు. స్నేహితుఁడవు. మేము జీవించునట్టి బలమునిమ్ము.

(3) నీభవనమున నమృతముంపఁబడినది. మాబ్రదుకునకునై దానిలోఁ గొంతభాగమిమ్ము.

సోమరస పరిమళసారముగల వాయువు పవమానమనఁబడును. తా పార్థివవాయువులపైఁ బ్రాణమాధారపడినది.

ఇఁక మేఘములును మేఘములను గదలించు పర్జన్యమరుత్తులను గుఱించియు రుద్రాది తదధిష్ఠాన దేవతలనుగుఱించియు నించుక వ్రాయఁబూనెద.

జలపూరితములగు మేఘములు ఘనీభవించి ఆపడియుండును. వానినిఁ

గదలించి యొకటికొకటి కొట్టికొని పగలులాగొనరించి యందున్న జలములను భూమిపైజాఱవిడిచి నలుదిక్కుల వ్యాపింపఁజేయువారు మరుత్తులు. వీరు రుద్రుని కొమారులు. రౌద్రస్వభావముగలవారు. యోధులు స్వాభావికముగ మరుచ్చలనమున మేఘములకు ఘర్షణనుండి యురుములు, మెరుపులుబుట్టి పిడుగులుపడు క్రమమునుఁజూచి. యది యంతరిక్షరంగమున జరుగు యుద్ధమనియెంచి ఋషులు తమ యిష్టానుసారముగ వర్ణించినారు. వర్షించుకర్మమునం దింద్రునకు మరుత్తులు సాహాయ్యులను కారణంబున నింద్రునకు మరుత్తులనుజంటఁగూర్చి ఋక్కులల్లినారు. వర్షమునకు నింద్రశబ్ద సారస్యమున నింద్రు డధికారియనునది సందియమైనను మరుత్తు లవశ్యమనుటకు సందియములేదు. గొప్ప పర్వతముపైన గుమిగూడి వ్రాలిన మేఘములను నలుదిక్కులకుఁదోలి భూమిపై వర్షముఁ గురియులా గొనరించువారు మరుత్తులుకదా; ఆ మరుత్తులను గుఱించిన ఋక్కులుగొన్ని యిచట వ్రాసెద.

M. 1. 64. (2) ఆకాశ వృషభములగు ఘనులు దైవములు రుద్రుని పుత్రులు, మరుత్తులు నిష్కల్మషులయి, సూర్యునిబలెఁ బ్రకాశించుచు, సకలము పావనమొనరించుచు, భయంకర రూపముగలవారయి రాక్షసులబలెనుండి వర్షము గురిపించుచు జనించిరి.

(3) రుద్రబాలకులు రాక్షసహంతలు, ముదిమిలేనివారు. పర్వతములబలె నజేయులయి వృద్ధినందుచున్నవారు. తమ శక్తిచే జీవకోటిని వడఁకించుచున్నవారు. భూమ్యాకాశములందుండు సమర్థులుసైతము వారికి నమ్రులగుదురు.

(5) ...సదా చలించుచు నాకాశగోవుల (మేఘముల) పొదుగులను బిండుచు భూమిచుట్టునుదిరిగి భూమినిఁ బాలునించుచున్నారు.

(7) అద్భుతశక్తికలవారయి, ప్రకాశాధికతఁగలిగి, పర్వతములబలె స్వయంధీరులయి యతివేగముగ దారి నడుచుచున్నవారు. అడవిని నగ్నితో సంచరించునపుడు మీ శక్తిఁ జూపుచు నేనుఁగులబలె వృక్షములను దినుచున్నారు.

1. 37. (7) మరుత్తులారా! మీ రాకఁగని నరుఁడు నమ్రుండగును. మీ యనుగ్రహమట్టిది. కాఠిన్యముగల పర్వతములు సైతము చలించును.

(9) మరుత్తులు సంచరించుచు మార్గమున మాటలాడుచుందురు. వారేమి మాటలాడునదియు నెవ్వరైనను వినఁజాలుదురా?

1. 38. (1) తండ్రి కొమారుని నాలింగనము సేసికొనినరీతి మీ రెపుడు నను నాలింగనము సేసికొనియెదరు.

(2) ఇపు డెచటికి? స్వర్గమున నెచ్చోటికిఁ బోవుచున్నారు? భూమిపై నిలువ రేల? మీ గోవులెచట మేయును?

(5) గడ్డియుండు నడవినిఁ జేరిన క్రూరమృగమునుంబలె నీ భక్తుఁడు చూడఁబడఁడు. అట్టివాఁడు యమునిమార్గముఁ బట్టఁడు.

[6] అజేయములగు మసూచిక బాధలు మమునంట కుండుఁగాత. క్షామము మానుండి వెడలిపోవునుగాత.

[9] భూమినంతయు నీరునించుచు నహస్సునసైత మంధకారముఁగల్పించి జలపూరిత మేఘములు గప్పుచున్నారు.

పైరీతిగ ననేకఋక్కులున్నవి. ఇట్టి యద్భుతశక్తులనుఁజూచి యచ్చెరు వంది యవి దైవములని భావించి గౌరవించి స్తుతించుచుండిరి. మనమిపుడు ఉఱుము యొక్క ధ్వనిని విందుము. రూపమునుఁ జూడఁజాలము. స్పర్శింపఁజాలము వాసనఁ గనలేము. రుచిఁ జూడలేము. ఈరీతిగ నుండినను నా శక్తినుండి శబ్దము వచ్చు చున్నది. అది వినఁబడుచున్నది. కారణమేమి? ఎచటనుండి వచ్చును? ఎవరినుండి వచ్చును? ఈ విషయము విమర్శనీయమయ్యెను, అడవినిఁ బోవునపుడు ఘర్జారావ మొకనికి వినఁబడును. అపుడేదో ఘర్జించు శక్తియొకటి యుండవలెనని యాలో చించి విమర్శించి చూచి యా ధ్వని సింహమునుండి పుట్టినదని తెలిసికొనుట సాధ్యమాయెను. ఉఱుముయొక్క ధ్వని వినఁబడెనుగాని యది యెవరినుండి పుట్టి నది కనుటకుఁ బ్రారంభమున నార్యులకుఁ దోఁపక యదియొక దైవశక్తియని భావిం చిరి. ఆ దైవశక్తికి "రుద్ర" యని నామమిడిరి. ఎపుడాశబ్దము రుద్రునుండి వచ్చె నని మనకు నమ్మికకలిగెనో యపుడే యా రుద్రశక్తికి పిడుగే యాయుధమని కల్పిం చిరి. ధనుర్బాణములు కలవాఁడని నమ్మిరి. పిదప, దుర్మార్గులను శిక్షించుటకును సన్మార్గులను రక్షించుటకును నవిధరించెనని నిర్ధరించిరి. ఉఱిమినవెంటనె వానకురిసి దేశము సుభిక్షమగుటచేఁ బ్రజలను రక్షించువాఁడనియు శుభములనిచ్చువాఁడ నియు బిరుదులిచ్చిరి. మొలకయెత్తి యాకులువిడిచినపిదప వృక్షమగుట కష్టము కాదుకదా? ఈరీతిగ నార్యులచే నూహింపఁబడిన రుద్రుఁడు పురాణయుగమునఁ ద్రిమూర్తులలో నొక్కఁడయి వేదగడిత దైవములను మూలఁ గూర్చుండఁబెట్టెను. రుద్రునిగుఱించి ఋగ్వేదములోఁ బలుకఁబడిన ఋక్కులలోఁ గొన్ని వ్రాసెద.

M. 1. 43. [4] ఆగమ విధులకును, ఋక్కులకును, నోషధులకును, స్వామియగు రుద్రునిగుఱించి యానందారోగ్యబలములకునై మేము నుతించు చున్నాము.

M. I. 114 [5] జటలుధరించి కపర్దియని నామమందినట్టియు నాకాశమున నెఱ్ఱఁగఁ బ్రకాశించు నడవిపందిగఁ జరించునట్టియు, రుద్రుని గౌరవబుద్ధినిఁ బిలుచుచున్నాము. శ్రేష్ఠతమమగు నౌషధముల చేతనుంచికొని

మాకు రక్షయు నీడయు భద్రమగు భవనమును నిచ్చుచుండును గాత.

[7] రుద్రా! చిన్నవారినిఁగాని పెద్దవారినిఁగాని బాధింపకు. పెరుగునట్టి పిల్లలనుగాని ముసలివారినిఁగాని తొందరపెట్టకు. తండ్రులనుగాని తల్లులనుఁగాని చంపకు. మాకుఁ బ్రియములగు శరీరములకే బాధయుఁ గలిగింపకు.

M. 2. 33. [1] మరుత్తులతండ్రీ! నీ యనుగ్రహము మము సమీపింపనిమ్ము. సూర్య దర్శనమునుండి మముఁ దప్పింపకుము.

[2] నీవిచ్చు సిద్ధౌషధములనుండి మేము శత హేమంతఋతువులు జీవింతుముగాత; శాత్రవభావమును, నసహ్యతయు మానుండి పాఱఁదోలుము. ఆధివ్యాధులు దిక్కునకొకటి పోనిమ్ము.

(3) పుట్టుగలవారికి స్వామివయి, రుద్రా! నీవు యశఃప్రకాశుఁడవైతివి. పిడుగు నాయుధముగఁగొని బలవంతులలో బలవంతుఁడవైతివి. మా బాధలనుఁబోఁగొట్టి సేమమొసఁగుము. అపాయములు మానుండి వోలఁద్రుము.

(4) పుష్టిమందులొసంగి మాశూరులకు బలమునిమ్ము. వైద్యులలో నీవు శ్రేష్ఠుఁడవని నేనువిన్నాను.

(13) మరుత్తులారా! స్వచ్ఛమగు మీమందులలో రుచ్యమైనట్టియు నారోగ్యకరమైనట్టియు మాతండ్రియగు మనువువలన నేర్పఱుపఁబడినట్టియు మందులను మా లాభసుఖములకుఁగాను రుద్రుఁడిచ్చునుఁగాత.

M. 7. 46. (2) మాకుటుంబ రోగములన్నియును రుద్రా! మాన్పుము.

పైరీతిగ రుద్రుని దైవముగఁ బొగడుటయగాక మంచివైద్యుఁడని పలికినారు.

M. 7. 59. (12) ఈఋక్కులో నేత్రత్రయోపేతమని వర్ణింపఁబడినది కావునఁ బురాణ యుగములోని త్రిమూర్తులలో నొకఁడైన రుద్రుఁడీదైవమనుటకు సందియము లేదు.

శుక్ల యజుర్వేదములో (16) రుద్రునకిపుడు పురాణములందుఁగల నామములు విశేషములు పలుకఁబడినవి. రుద్రుఁడొక ముఖ్యదైవమనుసూచన యప్పుడే యగపడుచున్నది. ఋగ్వేదములోఁ బైన వ్రాయఁబడినరీతిగ మరుత్తుల తండ్రియనియు ఘర్జారావమునిచ్చు పిడుగనియు భిషగ్వరుఁడనియు చెప్పఁబడినది కాని యంతకంటె హెచ్చేమియును లేదు. శుక్లయజుర్వేదములో మేఘనాథుఁడని పలుకుచు రుద్రుఁడు భయంకరమూర్తియనియు దొంగలు మొదలగువారి దైన

27009
25.2.33

మనియు లయాధికారియనియు పలుకఁబడినాడు. మైత్రాయణి బభ్రువర్ణుఁడని మేఘచ్ఛాయలనుబట్టి నామములిడినారు. ఆకారణంబుననే నీలకంఠయని పిలువఁబడుచున్నవాఁడు. వాన గురిపించుటచేఁ బశువులను గాపాడువాఁడు కావున పశుపతియని బిరుదుకలిగినది. రుద్రుఁడొనరించు కార్యమునుండి లోకమునకు మేలు కలుగుచుండును కావున శంకర శివయనునామములు వచ్చినవి. వేదములోఁగాని బ్రాహ్మణములోఁగాని రుద్రునిభార్యలు కాళి దుర్గలని పలుకఁబడలేదు. కౌషీతకి బ్రాహ్మణములో నొక్కచోటమాత్ర మీశానమహాదేవులకుఁ బ్రాముఖ్య మివ్వఁబడినది. శతపథ బ్రాహ్మణములో రుద్రా! ఇది నీభాగపుహవిస్సు. అనుగ్రహించి నీచెల్లెలగు నంబికతోవచ్చి దీనిని స్వీకరింపుమని పలుకఁబడినది (2. 6. 2. 9) కేనోపనిషత్తులో నుమాహైమవతీయను స్త్రీదైవము ఇంద్రునకు బ్రహ్మమును గురించి బోధించెనని పలుకఁబడినది.

ఇఁక ఋగ్వేదమునందుఁ బర్జన్యుఁ డొకదైవముగ నుతింపఁబడినాఁడు. ఆ ఋక్కులుగొన్ని యిచటవ్రాసెద.

M. 5. 83. [1] పర్జన్యుఁడు అంకెవేయు పిడుగుంబలె ధ్వనించుచుఁ, దనబహుమతు లతిత్వరితముగఁ బంపుచు, నోషధుల బీజము లుద్భవించుటకై నాటుచున్నవాఁడు.

[2] చెట్లు దూరదూరములుగ నుండులాగునఁ గొట్టుచున్నవాఁడు. రాక్షసులనుఁ జంపుచున్నవాఁడు. భయంక రాయుధములుగల పర్జన్యునకు జీవకోటి భయపడుచుండను. ఉఱిమెడు పర్జన్యుఁడు దుర్మార్గులను గొట్టినపుడు, పుణ్యమూర్తులుసైతము భీతిలి పఱుగిడుదురు.

[3] నీరునించిన మేఘములతో నాకాశమును బర్జన్యుఁడు గప్పినపుడు దూరమున సింహగర్జన లగుచున్నవి.

[4] మారుతములు వెనువెంటనె దుముకులాడును. వానివెంటనె మెఱుపులుదిగును. ఓషధులు మొలచును. దిక్కులు ప్రకాశించును. పర్జన్యుఁడు భూమినిఁ దడిపినతోడనె జీవకోటికెల్ల నాహారము పుట్టును.

[8] పర్జన్యా! గొప్పపాత్రనెత్తుము. నీరుఁజల్లుము ప్రవాహములడ్డులేక పాఱనిమ్ము. భూమ్యాకాశములను గొవ్వునఁ దడుపుము. గోవులకు నీరు సమృద్ధిగనుండనిమ్ము.

పైరీతిగ ఋషిధర్మము ననుసరించి ప్రకృతి మహిమలచేఁ గల్గు వర్షాగమములకు ననేకశక్తులను గలిగించి వానికి నామకరణంబు లొనరించి యార్యులు గౌరవబుద్ధిని వానిని నుతించుచుండిరి. పురాతన జనులందఱీరితిఁ బ్రకృతి సాంబంధిక శక్తులనుఁ బ్రార్థించుచుండిరనుటకు సాదృశ్యము లనేకములుగలవు.